ప్రజాశక్తి

శుక్రవారం ఏప్రిల్ 19 2024 8 పేజీలు

శ్రీకాకుళం

అగ్నిమాపక నిబంధనలు తప్పనిసరి

- పరిశ్రమలు ప్రమాణాలు పాటించాలి
- రీజనల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి

(...2లో)

'దువ్వాడ'కు షాక్

- ఎమ్మెల్యే అభ్యర్థిగా సతీమణి వాణి పోటీ
- పార్టీ పట్టించుకోకపోవడంపై మనస్తాపం
- ఎమ్మెల్సీ శ్రీనివాస్‌తో ఆస్తుల వివాదమూ మరో కారణమని ప్రచారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, టెక్కలి రూరల్

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కుటుంబంలో కొంత కాలంగా నెలకొన్న వివాదం ఆయన్ను వెంటాడుతూనే ఉంది. పార్టీ అధిష్టానం, సిఎంఒ అధికారులు జోక్యం చేసుకుని ఇరువరి మధ్య రాజీ కుదిర్చారు. ఈ నేపథ్యంలోనే శ్రీనివాస్ స్థానంలో వాణిని గతేడాది మేలో టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో వైసిపి రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల నియోజకవర్గ సమన్వయకర్తలను మార్పు చేసింది. టెక్కలి బాధ్యతలను మళ్లీ దువ్వాడ శ్రీనివాస్‌కే అప్పగించింది. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు వైసిపి గత నెల 16వ తేదీన విడుదల చేసిన జాబితాలో టెక్కలి అభ్యర్థిగా దువ్వాడనే ఖరారు చేసింది. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ గెలుపునకు సహ కరించాలని, ప్రచారంలో పాల్గొనాలని పార్టీ పెద్దలు సూచించినా, ఆమె ససేమిరా అన్నట్లు తెలిసింది. ఇప్పటివరకు తననెవరూ పట్టించుకోకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురైన ఆమె, టెక్కలి అభ్యర్థిగా బరిలో నిలవాలని నిర్ణయించినట్లు (మిగతా...2లో)

టెక్కలి నియోజకవర్గాన్ని ఈసారి ఎలాగైనా చేజిక్కించుకోవాలని వైసిపి అధిష్టానం రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. అభ్యర్థిని మార్చడం, గ్రూపుల పోరును కొంతవరకు సద్దుమణిగేలా చేసింది. దువ్వాడను అసెంబ్లీ అభ్యర్థిగా, పేరాడ తిలక్‌ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించి ఇద్దరూ సహకరించుకునే పరిస్థితి కల్పించింది. గ్రూపుల పోరు కాస్త తగ్గి పార్టీ పరిస్థితి గాడిన పడుతుందనుకుంటున్న తరుణంలో శ్రీనివాస్ సతీమణి వాణి ఎమ్మెల్యే అభ్యర్థిగా టెక్కలి నుంచి పోటీ చేయనున్నట్లు గురువారం అనూహ్యంగా ప్రకటించడంతో వైసిపి కేడర్‌లో కలకలం రేగింది. ఈనెల 22న ఆమె నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

టెక్కలి : నామినేషన్ దాఖలు చేస్తున్న రాజేష్

బోణీ పడింది

- మొదలైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ
- తొలి రోజు ఆరు నామినేషన్లు
- నామినేషన్ల వేసిన వారంతా స్వతంత్ర అభ్యర్థులే
- ఆర్ఒ కార్యాలయాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల సమరంలో కీలకమైన నామినేషన్ల ఘట్టానికి తెర లేచింది. జిల్లాలోని ఒక పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్లను స్వీకరించారు. తొలి రోజైన గురువారం మొత్తం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇచ్ఛాపురం, టెక్కలిలో ఒక్కటి చొప్పున, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో రెండు చొప్పున నామినేషన్లు దాఖలు అయ్యాయి. (మిగతా...2లో)

మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర సమన్వయకర్త వై.వి సుబ్బారెడ్డి

24న జగన్ సిద్ధం సభ

- టెక్కలిలో బస్సు యాత్ర ముగింపు
- వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వై.వి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఈనెల 24న టెక్కలిలో ముగుస్తుందని వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వై.వి సుబ్బారెడ్డి వెల్లడించారు. స్థానిక ఒక హోటల్‌లో టెక్కలి నియోజకవర్గ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ బస్సు యాత్రకు ప్రజల్లో అమితాదరణ (మిగతా...2లో)

ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్రం సర్వనాశనం

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - పొందూరు

ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. మండలంలోని కింతలిలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రాన్ని నిర్దాక్షిణ్యంగా విడదీసిన పరిస్థితుల్లో విభజన రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తే, వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు. సైకోకి ఒక్క అవకాశం ఇచ్చినందుకు ప్రజలు పశ్చాత్తాపం చెందుతున్నారని, తమ (మిగతా...2లో)

అభ్యర్థులూ... జాగ్రత్త

- పొరపాటు చేస్తే తిరస్కరణ
- నామినేషన్ల సమయంలో ఈ జాగ్రత్తలు తప్పనిసరి

(4,5లో)

చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మరు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలను, ఆయన ఇచ్చే హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, దండివీధి, సంతోషిమాత గుడి, పాత శ్రీకాకుళం ప్రాంతాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరిస్తూ పోస్టర్లను అందజేశారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట చెప్పడం అలవాటు అన్నారు. ఎన్నికల ముందు లేనిపోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. గత టిడిపి ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీల హవా నడిచేదన్నారు. అందుకు (మిగతా...2లో)

'ఉపాధి'లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సింహాచలం

ప్రజాశక్తి - హిరమండలం

ఉపాధి హామీ పనులను రెండు పూటలు కాకుండా ఒక్కపూటే చేయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని దుర్బలాపురంలో ఉపాధి హామీ పనులను సందర్శించి, కూలీలతో మాట్లాడారు. మండుటెండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం మంచినీళ్లు గానీ, నీడ కోసం టెంట్ గానీ వేయడం లేదన్నారు. మెడికల్ కిట్ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని విమర్శించారు. కోట్లాది మంది కూలీలు, వ్యవసాయ కార్మికులకు అన్నం (మిగతా...2లో)

ఎస్ఎఫ్ఐ మోడల్ ఎంసెట్‌కు స్పందన

ఎచ్చెర్ల : ఎస్ఎఫ్ఐ మోడల్ ఎంసెట్ పరీక్షను మండలంలోని చిలకపాలెంలో గల శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ పరీక్షకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాస్ మాట్లాడుతూ పరీక్షలంటే భయం పోగొట్టేందుకు, పోటీ పరీక్షల్లో రాణించేందుకు మోడల్ ఎంసెట్ దోహదపడుతుందన్నారు. ఇంజినీరింగ్ విద్య భవిష్యత్ తరాలను నిర్దేశిస్తుందన్నారు. విద్యార్థులు మరింత పై చదువులు చదివేందుకు తమవంతు కృషి చేస్తామని చెప్పారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమస్యలు, హక్కుల కోసం పోరాటాలు మాత్రమే కాకుండా పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసే ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడాన్ని అభినందించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ మాట్లాడుతూ విద్యారంగంలో సమస్యలపై ఎస్ఎఫ్ఐ అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలను, విద్య కాషాయీకరణ కాకుండా అడ్డుకోవడం విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.టి చంద్రశేఖర్, ఎంబిఎ హెచ్ఒడి కె.రవికుమార్, ఇన్‌ఛార్జి ఎగ్జామినేషన్ సెల్ ఇన్‌ఛార్జి ఇ.ప్రదీప్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.చందు, ఉపాధ్యక్షులు సిహెచ్.రాజు, కమిటీ సభ్యులు రేవతి, భూపతి, రవి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లకు ఐదుగురికే అనుమతి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

నామినేషన్ల దాఖలుకు నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఐదుగురికి మాత్రమే అనుమతి ఉందని బందోబస్తు ఇన్‌ఛార్జి, ఎస్ఇబి జెడి గంగాధరం తెలిపారు. బస్టాండ్ వద్ద కట్ ఆఫ్ పాయింట్‌ను గురువారం పరిశీలించారు. పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల దూరం వరకు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నామినేషన్ల సమయంలో పోలీస్ యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం గేటు నుంచి వంద మీటర్ల దూరం వరకు కట్ ఆఫ్ పాయింట్ ఉండాలని తెలిపారు. కేవలం అభ్యర్థితో పాటు మరో నలుగురు వ్యక్తులు, మూడు వాహనాలకు మాత్రమే తహశీల్దార్ గేటు వరకు అనుమతించాలన్నారు. వేరెవరికీ లోపలకు అనుమతించకూడదని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కేవలం మూడు కార్లు, ఐదుగురిని మాత్రమే అనుమతి ఇవ్వాలన్నారు. ర్యాలీలు, జనాలను వంద మీటర్ల దూరంలో మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం, సోంపేట సిఐలు ఇమ్మాన్యుయేల్ రాజు, మల్లేశ్వరరావు, ఇచ్ఛాపురం టౌన్, రూరల్, కవిటి ఎస్ఐలు సత్యనారాయణ, లక్ష్మణరావు, రాము సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న గంగాధరం

'దువ్వాడ'కు షాక్

తెలుస్తోంది.

ఆస్తుల వివాదమూ కారణమేనా?

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌తో ఉన్న ఆస్తుల వివాదమూ మరో కారణమని తెలుస్తోంది. వైసిపి పెద్దల సమక్షంలో జరిగిన ఆస్తుల పంపకం ఇంకా తేల్లేదని తెలిసింది. టెక్కలిలోని ఇల్లు, సొంటినూరు కొండ, గ్రానైట్ కొండ ఆమె పేరున రాస్తానని శ్రీనివాస్ అంగీకరించినట్లు తెలుస్తోంది. వాటిపై అప్పు ఉండడంతో, దాన్ని చెల్లించి తన పేరున రిజిస్ట్రేషన్ చేయాలని శ్రీనివాస్‌ను కోరినట్లు తెలిసింది. ఎన్నికల్లో గెలవకపోతే తన పరిస్థితేమిటని, ముందుగానే దీని సంగతి తేల్చుకోవాలని ఆమె అనుకుంటున్నట్లుగా కార్యకర్తల్లో ప్రచారం సాగుతోంది.

వాణి తప్పుకోకుంటే కష్టమే...

దువ్వాడ వాణి టెక్కలి బరిలో ఉంటే దువ్వాడ గెలుపు కష్టంగా మారుతుందన్న చర్చ నడుస్తోంది. దువ్వాడ వాణి ప్రస్తుతం టెక్కలి జెడ్‌పిటిసి సభ్యులుగా ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమె టెక్కలి నుంచి భారీ మెజార్టీతో జెడ్‌పిటిసిగా గెలుపొందారు. ఆమె కాంగ్రెస్ హయాంలోనూ టెక్కలి జెడ్‌పిటిసి సభ్యులుగా పనిచేశారు. 2004లో కాంగ్రెస్ పార్టీ తరుపున హరిశ్చంద్రపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆమె భర్త దువ్వాడ శ్రీనివాస్ పోటీ చేసిన ప్రతి ఎన్నికల ప్రచారంలోనూ కీలకపాత్ర పోషించారు. వాణి తండ్రి సంపతిరావు రాఘవరావు కూడా 1985, 1994, 1996 ఎన్నికల్లో హరిశ్చంద్రపురం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. రాజకీయ పరిచయాలు, కొంత కేడర్ ఉన్న నేపథ్యంలో ఓట్లు చీలి టిడిపికి లబ్ధి చేకూరవచ్చున్న చర్చ సాగుతోంది.

ఇచ్ఛాపురం : నామినేషన్ దాఖలు చేస్తున్న వరప్రసాదరావు

బోణీ పడింది

శ్రీకాకుళం, పాతపట్నం, నరసన్నపేట, పలాస అసెంబ్లీ, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. నామినేషన్లను స్వీకరించే రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడడంతో అధికారులు నామినేషన్ల స్వీకరణ మొదలుపెట్టారు. ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. జిల్లాలో ఒక పార్లమెంట్, ఎనిమిది శాసనసభా నియోజవర్గాలకు నామినేషన్లను స్వీకరణ ప్రారంభించారు. ఎంపీ స్థానానికి గురువారం ఒక్క నామినేషనూ దాఖలు కాలేదు. ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో రెండేసి, టెక్కలి, ఇచ్ఛాపురంలో ఒక్కొక్కటి నామినేషన్లు దాఖలయ్యాయి. తొలి రోజు నామినేషన్లు వేసిన వారందరూ స్వతంత్ర అభ్యర్థులే.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మండలంలోని రాజపురానికి చెందిన మాజీ సర్పంచ్ జన్నేల వరప్రసాదరావు నామినేషన్ దాఖలు చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో తొలి రోజు ఆ ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొరకు నామినేషన్ పత్రాలను

మొదటి పేజీ తరువాయి

అందించారు. వరప్రసాదరావు 2019 ఎన్నికల్లోనూ పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయనకు 1656 ఓట్లు పడ్డాయి. డిపాజిట్ కూడా దక్కలేదు. ఈసారి కూడా 'రైతు కులం' సంఘం పేరుతో పలు సమావేశాలు నిర్వహించి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

టెక్కలి : టెక్కలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా అట్టాడ రాజేష్ తన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్‌కు అందించారు. నందిగాం మండలం పెద్దలవునిపల్లికి చెందిన రాజేష్ మాత్రమే తొలి రోజు నామినేషన్‌ను దాఖలు చేశారు. దీంతో బోణీ పడినట్లయింది.

ఆమదాలవలస : ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పొందూరు మండలం లోలుగుకు చెందిన లోలుగు వెంకట రాజశేఖర్, ఆమదాలవలస మున్సిపాల్టీలోని మెట్టక్కివలసకు చెందిన గణపతి జగదీశ్వరరావు తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్‌కు అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.వేణుగోపాల్, ఎన్నికల డిటి మురళీధర్ నాయక్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా రణస్థలం మండలం పాతర్లపల్లికి చెందిన నేతల ఈశ్వరరావు, లావేరు మండలం తామాడకు చెందిన నడుపూరు ఈశ్వరరావు నామినేషన్లు దాఖలు చేశారు.

24న జగన్ సిద్ధం సభ

లభిస్తోందన్నారు. కిలోమీటర్ల కొద్దీ అభిమానులు, ప్రజలు వెన్నంటి వస్తున్నారని తెలిపారు. రోజుల తరబడి, జిల్లాలు దాటి, ఎండా వాన లెక్క చేయకుండా, వ్యయ ప్రయాసలను పట్టించుకోకుండా వేలాది కిలోమీటర్ల మేర సిఎం జగన్ వెంట ప్రయాణం చేస్తున్నారని చెప్పారు. బస్సు యాత్ర ముగింపు సందర్భంగా టెక్కలిలో సిద్ధం సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు లక్ష మందికి తక్కువ కాకుండా జన సమీకరణ చేయాలని చెప్పారు. సిఎం సభ విజయవంతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభతో ప్రతిపక్షాల వెన్నులో వణుకు పుట్టాలన్నారు. టెక్కలిలో వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు అఖండ మెజార్టీతో గెలిచేలా నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపై పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైసిపి ఉత్తరాంధ్ర ఉప సమన్వయకర్త చిన్న శ్రీను, జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థులు దువ్వాడ శ్రీనివాస్, గొర్లె కిరణ్ కుమార్, రెడ్డి శాంతి, నాయకులు పిరియా సాయిరాజ్, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న రామ్మోహన్‌నాయుడు, రవికుమార్

రాష్ట్రం సర్వనాశనం

భవిష్యత్‌ను తీర్చిదిద్దే అనుభవజ్ఞుడైన నాయకుడి కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలకు సుస్థిరమైన సంక్షేమ పాలన టిడిపి ప్రభుత్వం అందిస్తుందని హామీనిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ నియంతృత్వ పాలన సాగించిన వైసిపిని సార్వత్రిక ఎన్నికల్లో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహన్, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకటసత్యనారాయణ, మాజీ సర్పంచ్ ధవళ గణపతిరావు, టిడిపి నాయకులు అన్నెపు రాము, బాడాన శేషగిరి, చింతాడ కృష్ణవాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్మాన నుదిటికి తిలకం దిద్దుతున్న వృద్ధురాలు

బాబు హామీలను ప్రజలు నమ్మరు

భిన్నంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాలంటీరు వ్యవస్థను తీసుకొచ్చి పథకాలను నేరుగా ఇంటికే చేర్చారని గుర్తుచేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చగలిగామన్నారు. ప్రజలకు పారదర్శక పాలన అందించామని చెప్పారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా పాలన అందించారన్నారు. వైసిపి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వాలు కషి చేయాలని, అదే తాము చేశామన్నారు. ఇప్పుడు ఎన్నికల సమయం వచ్చేసరికి చంద్రబాబు వాలంటీరు వ్యవస్థను కొనసాగిస్తామని, రూ.పది వేలు చెల్లిస్తామని నమ్మబలుకుతున్నారని విమర్శించారు. 2014 ఎన్నికల్లో డ్వాక్రా సంఘాలకు, రైతులకు చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. మళ్లీ ఎన్నికల్లో దొంగ హామీలతో ఓట్లు అడుగుతున్నారని చెప్పారు. మేలు చేసే ప్రభుత్వానికి మరోసారి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నక్క రామరాజు, అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, సాధు వైకుంఠరావు, శిమ్మ రాజశేఖర్, పొన్నాడ రుషి, అంధవరపు ప్రసాద్, చౌదరి సతీష్, బిర్లంగి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పెట్టే ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసే చర్యలు చేపడుతోందని చెప్పారు. అటువంటి విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అంబానీ, అదానీ తదితర కార్పొరేట్ సంస్థలకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇస్తున్న మోడీ ప్రభుత్వం, బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధుల్లో కోత విధించడం దుర్మార్గమన్నారు. ఉపాధి కూలీలకు వేసవి భృతి 40 శాతం ఇవ్వాలని, మంచినీళ్లకు రూ.పది, గునపానికి రూ.50, తట్టకు రూ.20 ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో ఉపాధి హామీకి రూ.రెండు లక్షల కోట్లు కేటాయించాలన్నారు. 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు ఉపాధి కూలీ మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. బకాయిలను వెంటనే చెల్లించాలని, జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాన్నారు. కార్యక్రమంలో అల్లు నరేష్, అల్లు హరికృష్ణ, బోర రామకృష్ణ, చెక్క పార్వతి, మూకళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి - రణస్థలం

పరిశ్రమల్లో అగ్నిమాపక భద్రతా నిబంధనలు పక్కాగా పాటించాలని విశాఖపట్నం రీజనల్ అగ్నిమాపక అధికారి డి.నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం పైడిభీమవరం పారిశ్రామికవాడలో అపిటోరియా ఫార్మా లిమిటెడ్ (అరబిందో) పరిశ్రమలో అవగాహనా సదస్సు నిర్వహించారు. పరిశ్రమల్లో సంభవించే అగ్ని ప్రమాదాల గురించి ఉద్యోగులు, కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిమాపక యంత్రాల గడువు ముగిస్తే, వాటిని క్రమం తప్పకుండా మార్చాలని స్పష్టం చేశారు. అగ్ని ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించకుండా చూసేందుకు పరిశ్రమల్లో ఫైర్ మాక్ డ్రిల్స్ క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. తీవ్రమైన నష్టం వాటిల్లితే, బాధితుల నష్టాన్ని భర్తీ చేయడానికి ప్రతి పరిశ్రమ యజమాని బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహనరావు, రణస్థలం ఫైర్ ఆఫీసర్ పైల అశోక్, రణస్థలం ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఓటర్లకు అవగాహన

శ్రీకాకుళం అర్బన్ : ఓటరు అవగాహనా కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని ఏడురోడ్ల కూడలిలో ఈనెల 19న ఉదయం 7.30 గంటలకు జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ ఆధ్వర్యాన మానవహారం నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ ఎం.కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మానవహారం అనంతరం ఏడురోడ్ల కూడలి నుంచి పాలకొండ రోడ్డు, కృష్ణాపార్కు, డేఅండ్‌నైట్ జంక్షన్, అంబేద్కర్ జంక్షన్ మీదుగా ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ స్వీప్ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు పెద్దఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు.

- గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
- చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం

బెల్ట్ షాపులకు అడ్డుకట్ట ఏదీ?

సంపూర్ణ మద్యపాన నిషేధమే మా ధ్యేయం. దశలవారీగా మద్యం షాపులను మూసి వేస్తాం. బెల్ట్ షాపులను లేకుండా చూస్తాం. మద్యం లేకుండా చేస్తామని ఎన్నికల సమయంలో హామీలను గుప్పించిన వైసిపి ప్రభుత్వం నేడు ఆ హామీలను తుంగలో తొక్కింది. ప్రస్తుతం పట్టణ ప్రాంతంలోనే కాకుండా పల్లెల్లోను గిరిజన గూడల్లో కూడా బెల్టు షాపుల్లో మద్యం విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నాయి.

ప్రజాశక్తి- బూర్జ

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బెల్టు షాపులను లేకుండా చేయడమే కాకుండా మద్యం షాపులను కూడా దపదపాలుగా మూసి వేస్తామని, తద్వారా సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని ప్రయత్నించిన ప్రభుత్వం నేడు ఆ మాటే మరిచింది. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో కూడా మద్యం ఏరులై పారుతుంది. బెల్ట్‌షాపులు లేకుండా చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా నేడు గ్రామ గ్రామాన బెల్టు షాపులు వెలిశాయి. ప్రభుత్వ దుకాణాల్లో ఒక వ్యక్తికి ఒకే బాటిల్ ఇస్తామని నియమం ఉన్నప్పటికీ బెల్టు షాపులకు మద్యం ఎలా వస్తుందో అర్థం కావడం లేదు. ప్రస్తుతం శాసనసభ, పార్లమెంట్‌కు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మద్యం విక్రయాలు నివారించేందుకు అధికారులు, ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ప్రకటనలు గుప్పిస్తున్నారు తప్పా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని మండల ప్రజలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారని, ఎన్నికల సమయంలో పరిమితికి మించి బాటిళ్లు ఉంటే పట్టుకుంటున్న పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు బెల్టు షాపుల్లో మితిమీరిన మద్యం ఉన్నప్పటికీ ఎందుకు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో బెల్ట్ షాపులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని, దీనివలన బెల్టు షాపుల్లో కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. మందుబాబులకు వేరే గత్యంతరం లేక బెల్టుషాపులు వారు నిర్ణయించిన ధరకే మద్యం కొనుగోలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు నామమాత్రపు సోదాలు జరిపి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మండలంలో బెల్ట్‌షాపులను అరికట్టాలని, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో బెల్ట్ షాపులకు అధిక ధరలకు విక్రయిస్తున్న మద్యం షాపులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ రాజారావును వివరణ కోరగా గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించినా, మద్యం విక్రయించిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టామన్నారు. అక్రమ మద్యం కలిగి ఉన్నా, బెల్టుషాపులు నిర్వహించినా కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎక్కడైనా ఎవరైనా మద్యం విక్రయిస్తే సమాచారం ఇస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- బూర్జ



రమణ (ఫైల్)

మండలంలోని ఉప్పునివలస గ్రామ సమీపంలో ఉన్న కోనేటి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బోరవెల్లి రమణ (40) గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం సాయంత్రం వైకుంఠపురంకు చెందిన తమ్మినేని సింహాచలం తన గ్రామం నుంచి ఉప్పునివలస గ్రామానికి సైకిల్‌పై వెళుతుండగా అదే సమయంలో కొల్లివలసకు చెందిన బోరవెల్లి రమణ బైక్‌పై వస్తూ వెనుక నుంచి సైకిల్‌ను ఢీ కొట్టడంతో ఇద్దరూ పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించగా రమణ మృతి చెందినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. మృతుడికి భార్య రాము, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతున్న కిరణ్‌కుమార్

కొట్లాటలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఫరీద్‌పేటలో ఒక శుభకార్యం దగ్గర వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ఇరువువర్గాల మధ్య ఘర్షణ జరిగి కొట్లాటకు దారితీసింది. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు ఇరువురు మధ్య మాటామాటా పెరిగి దాడి చేసుకున్నారు. ఈ దాడిలో కూన కిరణ్ కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం కిరణ్ చికిత్స పొందుతున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. గత కొంతకాలంగా వ్యక్తిగతంగా వీరి మధ్యన గొడవలు జరిగినట్లు ఎస్ఐ తెలిపారు. కొన్ని రోజుల క్రితం సొంత బావపైన దాడి విషయంలో కిరణ్ కుమార్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు. ఈ ఘటనను దృష్టిలో పెట్టుకొని ఫరీద్‌పేటలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

పలాస: మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మున్సిపాలిటీని అభివృద్ధి చేయకపోగా, జంట పట్టణాలను నాశనం చేస్తున్నారని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తానని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష హామీనిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో మొగిలిపాడు ప్రాంతంలో గురువారం రాత్రి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా 30 కుటుంబాలు టిడిపిలో చేరారు. వారికి ఆమె పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, అందుకు అనుగుణంగా మంత్రి తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిసిసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గుంటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బి.నాగరాజు, సప్ప నవీన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కవిటి: మండలంలోని నెలవంక పంచాయతీ సన్యాసిపుట్టుగ గ్రామస్తులు తమలోని ఔదార్యాన్ని ప్రదర్శించారు. గ్రామానికి చెందిన నౌపడ హంసమ్మ అనారోగ్యానికి గురై కోమాలో ఉంది. ఆమె పేదరికాన్ని గుర్తించి గ్రామస్తులు యువత కలిసి వైద్య ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా రూ30,300లు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కేశపురం ఉప సర్పంచ్ నీలాపు గోపీరెడ్డి, యువకులు పాల్గొన్నారు.

గోవిందరావు ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- కొత్తూరు

మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ గ్రూపునకు చెందిన నాయకులను టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు గురువారం ఆత్మీయంగా కలిశారు. ముందుగా కుంటిభద్రకు చెందిన గురండి టిడిపి ఎంపిటిసి అగతముడి బైరాగినాయుడు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు ఎ.అరుణ్‌కుమార్, తిమర జగదీష్, కె.రాజు, ఎ.కాంతారావు, కర్లెమ్మ సర్పంచ్ లోతుగెడ్డ భగవా న్‌దాస్ నాయుడు, రాజేంద్రనాయుడు, కురిగాం మాజీ సర్పంచ్ పైల లక్ష్మణరావు, డి.చిట్టి, దండాసి, హంస గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు కొమరపు వెంకటరావు, సర్పంచ్ ప్రతినిధి మజ్జి వెంకటరావు, కె.లక్ష్మణరావు, కొత్తూరులోని నాయకులు నాగమణి, తిరుపతిరావు, మాతల గాంధీ, వి.సుధాకర్, అగతముడి మాధవరావు, ఎద్దు దాసు నాయుడు, ఎం.కృష్ణ, గెడ్డవలస కమలాకర్‌లను కలిశారు.

నేడు గౌతు శిరీష నామినేషన్

ప్రజాశక్తి- పలాస

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష శుక్రవారం 10.30 గంటలకు పలాస ఎన్నికల అధికారికి నామినేషన్ సమర్పిస్తానని తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనలు లోబడి కొద్దిమందితో నామినేషన్ దాఖలు చేయను న్నామని అన్నారు. కార్యకర్తలు, అభిమానులు వడదెబ్బకు గురయ్యి ఇబ్బందులు పడకూడదనే సదుద్దేశ్యంతో నూతన విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యకర్తలు, అభిమానులు వారి ఇంటి వద్ద నుంచే ఆశీర్వదించాలని కోరారు.

పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న జనసేన నాయకులు

శ్రీకాకుళం అర్బన్: 2024 ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని జనసేన శ్రీకాకుళం నియోజక వర్గ నాయకులు కొండా ఉదయ్ శంకర్ కోరారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గురువారం ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి

జనసేన నాయకుల ప్రచారం

గొండు శంకర్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాకర్స్, విశ్రాంత ఉద్యోగులు, క్రీడాకారులు, విద్యార్థులతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు మేనిఫెస్టోలో పొందుపర్చిన అంశాలపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం గడచిన ఐదేళ్ల పాలనలో యువతను అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గురు ప్రసాద్, వెంకీ పట్నాయక్, రావాడ కామేష్, అర్జున్, సతీష్, సంతోష్, గౌరీ నాగేంద్ర, కళ్యాణ్, కిషోర్, కాశి, అమర్ పాల్గొన్నారు.

మరో అవకాశం ఇవ్వాలి

ప్రజాశక్తి- లావేరు

ప్రజలకు సేవ చేయడానికి, నియోజకవర్గ పెండింగ్ పనులు పూర్తి చేయడానికి ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. గురువారం లావేరు, గోవిందపురం పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులు జరుగుతున్న దగ్గరకు వెళ్లి కూలీలతో మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలన్నారు. టిడిపి, జనసేన, బిజెపి మాటలు నమ్మవద్దని కోరారు. ఈనెల 24న నామినేషన్

ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

వేస్తున్నానని ఈ కార్యక్రమానికి అందరూ వచ్చి మద్దతు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఆర్.బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, మీసాల శ్రీనివాసరావు, దేశెట్టి తిరుపతిరావు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారితో గౌతు శిరీష

టిడిపిలో పలువురు చేరిక

పలాస: మండలం కైజోల గ్రామం నుంచి 20 మంది యువకులు గురువారం టిడిపిలో చేరారు. వీరికి స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎన్. సింహాచలం, తెప్పల దాసు, బి.నరేంద్ర, బి.సాయికుమార్, తిరుపతి, నరేంద్ర, అఖిల్, తరుణ్, సాయికుమార్, సంతు, శ్రీను, దీపక్, ఎన్.ప్రసాద్ ఉన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ వంకల కూర్మారావు, మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్, దువ్వాడ సంతోష్ కుమార్, దానేటి పద్మజ, నవర సోమేశ్వరరావు పాల్గొన్నారు.

వడ్డిస్తున్న సర్పంచ్ రజని, తేజ తదితరులు

బంటుపల్లిలో అన్నదానం

రణస్థలం రూరల్: మండలంలోని బంటుపల్లిలో గురువారం సీతారామ కళ్యాణ మహోత్సవం అనంతరం పట్టాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక సర్పంచ్ నడుకుదిటి రజని ఈశ్వరరావు సారథ్యంలో వెలిచేటి సురేష్ కుమార్, మణి దంపతులు, చింతపల్లి వెంకట రాజేష్, చిన్ని దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదానానికి భారీ ఎత్తున యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గురాల జగన్నాథరావు, మన్నె నారాయణరావు, మన్నె కృష్ణానందం, నడుకుదిటి తేజ, వెలిచేటి రాయుడు, సుధాకర్ కుమార్, రమేష్ బాబు, కాకి రమణ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని విశాఖ-బి కాలనీలో ఉన్న షిర్డీసాయి మందిరంలో డాక్టర్ సంపతిరావు శ్రీదేవి, శివప్రసాద్ దంపతులు, కొరాడ కైలేశ్వరరావు, ఉమాగౌరీల నేతృత్వాన శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. జిల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో దుర్గ, దిలీప్, జమున, జి.ఎస్.ఆర్. గుప్తా, నాగమణి, బి.జయలక్ష్మి, వి.శ్రీనివాసరావు, రాజురత్నం, కొత్తూరు రామారావు, హైమా రావు, భవానీ, సాంబశివరావు, శేఖర్ హాజరయ్యారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

నౌపడ: సంతబొమ్మాళి మండలంలోని రెండో హను మంతపురం అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి, అంట్లవరంలో దుర్గాదేవి ఆలయ నిర్మాణానికి చెరో రూ.5 వేలు మరువాడ సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి విరాళంగా గురువారం అందజేశారు. తమ పెళ్లిరోజు సందర్భంగా విరాళాన్ని ఆయా గ్రామాల్లోని ఆలయ కమిటీ సభ్యులకు దాసురాజు, ధనలక్ష్మి దంపతులు నగదును అందజేశారు.

ఆకట్టుకున్న హరికథ

కవిటి: కవిటి గ్రామంలోని రఘునాథస్వామి ఆలయం, ముత్యాలపేటలోని మొక్క సీతారామ స్వామి ఆలయాల వద్ద శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం రఘునాథస్వామి ఆలయం వద్ద గాన సమ్మేళనం,శివ పార్వతి కళ్యాణం హరికథ అలరించాయి. తెనాలికి చెందిన శివపార్వతి భాగవతారని హరికథ గానం చేశారు.

దళిత నాయకుల హర్షం

టెక్కలి : దళితులకు శిరోముండనం కేసులో వైసిపి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు ఎట్టకేలకు శిక్ష పడడం హర్షణీయమని దళిత మహాసభ జిల్లా అధ్యక్షులు బోకర నారాయణరావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా యడ్లగోపి, సమతా సైనిక్‌దళ్ జిల్లా కన్వీనర్ చల్లా రామారావులు వేర్వేర్వుగా విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. అయితే శిరోముండనం ఘటన జరిగి 28 ఏళ్ల తరువాత కోర్టు తీర్పు నివ్వడం అభినందనీయమన్నారు. దళిత సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు.

చంద్రబాబు వ్యాఖ్యలు సరికావు

కోటబొమ్మాళి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిపై విజయవాడలో ఇటీవల జరిగిన రాయిదాడిపై మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు సరికావని కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు అన్నారు. ఈ మేరకు తన నివాసగృహం కమలనాభపురంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. జరిగిన దాడి తానే స్వయంగా సృష్టించికున్నాడని అనటం ప్రజాస్వామ్యవిరుద్ధమన్నారు. చంద్రబాబు, టిడిపి నాయకులు చేస్తున్న వ్యాఖ్యానాలు తీవ్రంగా ఖండిస్తున్నాని పేర్కొన్నారు.

'కింజరాపు' హ్యాట్రిక్ సాధించేనా?

టెక్కలి : టెక్కలి నియోజకవర్గం ఏర్పడిన తరువాత తొలి రెండు ఎన్నికల్లో కింజరాపు అచ్చెన్నాయుడు ఓటమిపాలయ్యారు. 2014, 2019 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. వచ్చే ఎన్నికల్లో విజయవం సాధిస్తే హ్యాట్రిక్ సాధించినట్లు. ఈ నేపథ్యంలో కింజరాపు విజయంపై పలు సందేహాలఉన వ్యక్తం చేశారు. అచ్చెన్నాయుడు ఎమ్మెల్యేగా గెలిచినా... రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చింది. దీంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న దువ్వాడ శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్సీ ఇవ్వడంతో నియోకవర్గంపై పెత్తనం పెరిగింది. వచ్చే ఎన్నికల్లో టిడిపి నుంచి అచ్చెన్నాయుడు, వైసిపి నుంచి దువ్వాడ శ్రీనివాస్, ఇండియా ఫోరం నుంచి కిల్లి కృపారాణి తడబడనున్నారు. తన హయాంలోనే టెక్కలి నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని ఎవరికి వారు చెప్పకుంటున్నారు. దీనికి తోడు రెండు పార్టీల్లోనూ అంతర్గత విభేదాలు ఉన్నాయి. ఈ ఐదేళ్లలో అచ్చెన్నాయుడు నియోజకవర్గాన్ని దర్శించిన దాఖలాలు లేవని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు విషయంలో రెతులకు జరిగిన ఆన్యాయంలో గానీ, గతంలో కింజరాపు హయాంలోనే నిర్మాణం జరిగిన అభివృద్ధి పనులను ప్రారంభించడంలో గానీ, హుదూద్ ఇళ్ల పంపిణీ విషయంలో గాని, పట్టుమహదేవి కోనేరు విషయంలో గానీ, ఇలా చెప్పుకుంటే ఆనేక ప్రజా సమస్యలపై అచ్చెన్నాయుడు ఒక్కసారీ ప్రజా పోరాటం చేసిన దాఖలాలు లేవు. ఇప్పుడు ఎన్నికల సమయంలో మాత్రం ప్రచారానికి రావడం గమనార్హం. కాగా, గడచిన ఎన్నికల్లో టిడిపి, తరుపున అచ్చెన్నాయుడు 8 వేలు పైచిలుకు ఓట్లు మెజార్టీతోనే గెలుపొందారు. మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో కింజరాపు ఇప్పుడు హ్యాట్రిక్ సాధిస్తారా? లేదా? అనే సందేహాలు పలువురు వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల వేళ... ముహూర్తాల గోల

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఎన్నికలు అంటేనే సెంటిమెంట్ల పర్వానికి తెరతీసినట్లు లెక్క. అందులోనూ గురువారం నుంచి నామినేషన్ల పర్వం మొదలైంది. దీంతో అభ్యర్థులంతా ముహూర్తాల కోసం ఇప్పటికే అయ్యవార్ల చుట్టూ ప్రదక్షిణాలు చేశారు. తమ పేరు బలం, రాశులు, జాతక చక్రాలు, గోచార ఫలితాలు పోల్చుకుంటున్నారు. సంప్రదాయ జాతక చక్రాలతోపాటు, నాడీ జ్యోతిష్యం, సంఖ్యాశాస్త్రం, వేలిముద్రలు, హస్తరేఖాశాస్త్రం... ఒకటేమిటి అందుబాటులో ఉన్న అన్నిరకాల శాస్త్రాల్నీ తిరగేస్తున్నారు. ఆయా రంగాల్లో పండితులు ఎక్కడెక్కడ ఉన్నారో నేతల అనుచరణ గణం ఆరా తీస్తూ... వారి ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేశారు... చేస్తునే ఉన్నారు. దీంతో పండితులంతా ఉన్నట్టుండి 'బిజీ' అయ్యారు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యాలయాల మాదిరిగానే పండితుల ఇళ్లు కూడా పార్టీ నేతలు, కార్యకర్తలు, అనుచరగణాలతో సందడి నెలకొంది.

ప్రచారం చేస్తున్న చక్రవర్తిరెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న మాసుపత్రి చక్రవర్తిరెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలో 4,20 వార్డుల్లో ప్రచారం చేశారు. ఇండియా ఫోరం అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను ఓటర్లకు వివరించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలీమ్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, వాసు పాల్గొన్నారు.

మీకు తెలుసా?

గతంలో ఫిర్కాలనే నియోజకవర్గాలుగా పరిగణించే వారు. బ్రిటీష్ వారి కాలంలో నగరికటకం ఫిర్కా ఉండేది. స్వాతంత్రం వచ్చిన తరువాత 1952లో జరిగిన ఎన్నికల్లో నగరికటకం నియోజకవర్గం నుంచి హెచ్.సత్యనారాయణదొర ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అటు తరువాత తమ్మినేని పాపారావు ఇదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978 నియోజకవర్గాల పునర్విభజన అనంతరం నగరికటకం నియోజకవర్గం కనుమరుగై... ఆమదాలవలస నియోజకవర్గం రూపాంతరం చెందింది. అప్పటివరకూ నగరికటకం నియోజకవర్గంలోని 14 పంచాయతీలు నరసన్నపేట నియోజకవర్గంలో విలీనమయ్యాయి.

– ప్రజాశక్తి, ఆమదాలవలస

రంగంలోకి ఎంపీ సతీమణి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఎంపీ రామ్మోహన్‌నాయుడు సతీమణి శ్రావ్య తొలిసారి ప్రచారం రంగంలోకి దూకారు. శ్రీకాకుళం నగరంలోని విశాఖ–బి కాలనీలో గురువారం శ్రీకాకుళం అసెంబ్లీ అభ్యర్థి గొండు శంకర్ సతీమణి గొండు స్వాతితో కలిసి ఇంటింటా ప్రచారం సాగించారు. ఓటర్లకు టిడిపి సూపర్ సిక్స్ పథకాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. రామ్మోహన్‌నాయుడు సతీమణి వీధుల్లో పర్యటించడంతో మహిళలు ఆసక్తిగా చూశారు.

ప్రచారం చేస్తున్న శ్రావ్య, స్వాతి

24న ఎంపీ నామినేషన దాఖలు

ఎంపీ రామ్మోహన్‌నాయుడు టిడిపి ఎంపీ అభ్యర్థిగా ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఎంపీ కార్యాలయవర్గాలు తెలిపాయి. కార్యక్రమానికి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

గ్రామాల్లో 'సువ్వారి' ప్రచారం

పోస్టరును పంపిణీ చేస్తూ ఓటును అభ్యర్థిస్తున్న గాంధీ

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

అభివద్ధి నిరోధకలకు ప్రజలే బుద్ధి చెప్పాలని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. గురువారం సరుబుజ్జిలి మండలంలోని మతలబుపేట, గోనెపాడులో ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో తనకు ఓటువేసి అత్యధిక మెజారిటితో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి కంటే విధ్వంసమే ఎక్కువగా జరిగిందన్నారు. మండలంలో ఎక్కడ చూసినా శిలాఫలకాలే కనిపిస్తున్నాయని, అభివృద్ధి, మౌలిక సదుపాయాలకు నోచుకోకుండా గ్రామాలు దూరంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా విద్యావంతులైన ఓటర్లు వారి అసమర్ధ చేతకాని పాలనను గ్రహించి రానున్న ఎన్నికల్లో ఓటు అనే వజ్రాయుధంతో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బగాది ఈశ్వర్, కూన వాసు, కూనపల కృష్ణ, వి.శ్యామలరావు, వి.అప్పన్న, ఎస్.రమణయ్య, పి.ఆనందరావు, తిలక్, రాంబాబు, అన్నాజీ, కృష్ణ, రాజశేఖర్, శ్రవణ్, మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విచిత్ర ప్రచారాలు

దోసెలు వేస్తున్న విజయ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల మద్దతు కూడగట్టుకునేందుకు రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు పడుతున్న పాట్లు అంతాఇంతా కాదు. ఒక్కొక్కరి ఒక స్టయిల్ ప్రదర్శిస్తూ ఓటర్లు ఆకట్టుకునేందుకు నానా పాట్లు పడుతూ ఆకట్టుకుంటున్నారు. ఇందులో ప్రధానంగా ఇచ్ఛాపురం వైసిపి అభ్యర్థి పిరియా విజయ మరింత దూకూడు పెంచుతుంది. గ్రామాల శివారు ప్రాంతాల్లో చెరువుల వద్ద పనులు చేసుకుంటున్న ఉపాధి కూలీలను స్వయంగా కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అన్ని తరగతులను కలుస్తూ మద్దతు కోరుతున్నారు. ఇటీవల ఉపాధి కూలీలతో కలిసి తిరిగి వస్తుండగా మార్గంమధ్యలో మేకలు గొర్రెలు కాస్తున్న కాపరినీ విడవలేదు. అక్కడే ఉన్న చిన్న మేక పిల్లని తీసుకోని ఆడించడం అందరనీ ఆకట్టుకుంది. అదేవిధంగా పట్టణంలో ప్రచారం చేస్తున్న సమయంలో టిఫెన్ హోటల్ వద్ద విజయ స్వయంగా దోసెలు వేయడం పార్టీ నేతలకు అందించారు. డైలీ మార్కెట్‌లో ప్రచారం చేస్తున్నప్పుడు గాజులు అమ్మతున్న వ్యాపారుల వద్దకు వెళ్లి గాజులు వేడుకోవడం వైసిపి ప్రచారాల్లో చిత్రవిచిత్ర సంఘటనలు చూడాల్సి వస్తోంది. ఇంకా పోలింగ్‌కి సమయం ఉండడం వల్ల ఇంకా ఎన్ని విచిత్రాలు చూడాల్సి వస్తోంది. మొత్తంమీద ఎన్నికల సమయంలో నేతలు పడుతున్న పాట్లు ఓటర్లు గమనిస్తూనే ఉన్నారు.

దుకాణంలో టీ తాగుతున్న రవికుమార్

పొందూరు : మండలంలోని కింతలిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ఓ టీ షాపులో సూపర్ సిక్స్ పథకాలపై టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కూన కుమార్ అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా తాగుతూ కనిపించారు.

మేకపిల్లను ఎత్తుకున్న విజయ

అఫిడవిట్‌లో ఏముంటుంది?

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఎన్నికల బరిలో నిలబడే అభ్యర్థులు అఫడవిట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల ప్రక్రియలో అఫిడవిట్ అత్యంత కీలకం. నామినేషన్ పత్రాలతో పాటు అఫిడవిట్‌ను రిటర్నింగ్ అధికారికి తప్పక అందజేయాల్సి ఉంటుంది. అయితే నేరచరితులైన అభ్యర్థులు మాత్రం తమపై మోపిన అభియోగాలతో కూడిన వివరాలు పొందుపరచాల్సి ఉంటుంది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు తమ నేరచరిత్ర, కేసుల వివరాలు వెల్లడించే సమయం ఆసన్నమైంది. ఒక్కో అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు వేసే అవకాశం ఉంటుంది. అభ్యర్థి బి–ఫామ్ అందించకపోతే స్వతంత్రులుగా గుర్తింపు పొందుతారు. నామపత్రాలు దాఖలు చేసే అభ్యర్థులు అఫిడవిట్‌కు సంబంధించి ఫామ్–26 విద్యార్హతలు, నిర్వర్తించే బాధ్యతలు, ఆస్తుల వివరాలతోపాటు క్రిమినల్ కేసుల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. నామినేషన్ దాఖలు చేసిన తర్వాత పత్రికా ప్రకటన మూడు వేర్వేరు ప్రచురణల్లో నమోదు కావాల్సి ఉంటుంది. ఎన్నికల అధికారులు సదరు వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచుతారు.

తప్పుడు వివరాలు ఇచ్చినా.. సరైనవి నమోదు చేయకపోయినా ఎవరైనా కోర్టులో సవాలు చేయడానికి వీలుంటుంది. ఫారంలోని ప్రతి గడినీ పూర్తి చేయాల్సి ఉంటుంది. సంబంధం లేని విషయమైతే నాట్ అప్లికేబుల్ అని రాయాలి. లేకుంటే నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది. అభ్యర్థి ఏదో ఒక నియోజకవర్గానికి చెందిన వారుగా ఓటు హక్కును పొంది ఉండాలి. కానీ, ఆయనకు బలపరిచే వారు తప్పనిసరిగా అదే నియోజకవర్గం పరిధిలో ఓటర్లుగా నమోదై ఉండాలి. గుర్తింపు పొందిన పార్టీ నుంచి అయితే ఒక ఓటరు బలపరిస్తే సరిపోతుంది. స్వతంత్ర అభ్యర్థులైతే వారికి పది మంది ఓటర్లు బలపరచాల్సి ఉంటుంది.

'పేట'లో బంధు రణమే

- టిడిపి, కాంగ్రెస్ నుంచి చెరో నాలుగు పర్యాయాలు విజయం
- ఇదీ నరసన్నపేట నియోజకవర్గం

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట ఒకప్పుడు నగరికటకం నియోజకవర్గంలో ఉండేది. నరసన్నపేట నియోజకవర్గంగా ఏర్పడిన తరువాత అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ఈ నియోజకవర్గం 1956లో ఏర్పడి నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట ఈ పరిధిలోఉంది. తొలి ఎమ్మెల్యేగా శిమ్మ జగన్నాథం ఎన్నికయ్యారు. 2009లో నియోజకవర్గ పునర్విభజనలో హరిశ్చంద్రపురంలోని నరసన్నపేటకు చెందిన 44 పంచాయతీలు నరసన్నపేటలో కలిశాయి. పారిశ్రామికంగా పెద్దగా అభివృద్ధి లేనప్పటికీ మడపాంలోని వంశధార పేపర్ మిల్లు దశాబ్దాలు కిందట ఏర్పాటై కార్మికులకు ఉపాధి కల్పిస్తోంది. దక్షిణ కాశీగా కీర్తిపొందిన శ్రీముఖలింగం ముఖలింగేశ్వరస్వామి ఆలయం జలుమూరు మండలంలో ఉంది. నరసన్నపేట నుంచి వివిధ పార్టీల తరుపున పోటీ చేసే అభ్యర్థుల్లో ఎక్కువగా మంది బంధుగణమే కావడం విశేషం. వంశధార నదీ తీర ప్రాంతం కలిగిన నియోజకవర్గంలో ప్రధానంగా ఎప్పడూ ఎక్కువగా వెలమ సామాజిక తరగతి నేతలే ఎన్నికవుతూ వస్తున్నారు.

నరసన్నపేట నియోజకవర్గం ఏర్పడిన 1955 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో బంధుగణాలే ఎన్నికవుతూ వస్తున్నాయి. నియోజకవర్గంలో వెలమ సామాజిక తరగతి ఓట్లు అధికం. బరిలో ఉండే అభ్యర్థులూ ఈ సామాజిక తరగతికి చెందిన వారే ఎక్కువగా తలపడుతున్నారు. దీంతో ఓట్లు రెండుగా చీలడం పరిపాటిగా మారింది. ఇక పోలాకి మండలంలో అత్య ధికంగా కాళింగ, సారవకోట మండలంలో కాపు సామాజిక తరగతి ఓట్లు ఉన్నాయి. ముఖ్యంగా శ్రీశయన తరగతికి చెందిన ఓట్లతో పాటు వైశ్య, ఎస్‌సి, ఎస్‌టి సామాజిక తరగతి చెందిన, మత్స్యకారులు ఓట్లు అభ్యర్థులు గెలుపోటములను నిర్ణయిస్తాయి.

ఈ నియోజకవర్గంలో 1955 నుంచి 1973 వరకు శిమ్మ జగన్నాథం వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా, ఆ తరువాత అత్యధికంగా ధర్మాన సోదరులు విజయం సాధించారు. కాంగ్రెస్ తరపున డోల సీతారాములు ఒక పర్యాయం, ధర్మాన ప్రసాదరావు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ధర్మాన కృష్ణదాస్ కాంగ్రెస్ తరపున రెండు పర్యాయాలు, ఆ తరువాత ఉప ఎన్నికలో వైపిసి తరుపున రెండు పర్యాయం ఎన్నికయ్యారు. ప్రస్తుతం ధర్మాన కృష్ణదాస్ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. పార్టీలపరంగా పరిశీలస్తే టిడిపి నాలుగు సార్లు, కాంగ్రెస్ నాలుగు, రెడ్డి కాంగ్రెస్ ఒకసారి, వైసిపి రెండుసార్లు, అంతకుముందు స్వతంత్ర పార్టీ తరపున ప్రజాప్రతినిధులు ఎన్నికయ్యారు.

మూడు కుటుంబాల మధ్యే పోరు

నియోజవర్గంలో ప్రధానంగా మూడు కుటంబాల మధ్యే పోరు సాగుతోంది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా శిమ్మ జగన్నాథం, కాంగ్రెస్ మద్దతుగా బగ్గ సరోజనమ్మ, డోల సీతారాములు కుటుంబం వ్యవహరించాయి. ధర్మాన ప్రసాదరావు కుటుంబం 1989 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చింది. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల వరకు ధర్మాన, బగ్గ కుటుంబాల మధ్యే పోరు సాగింది. ప్రధానంగా శిమ్మ జగన్నాథం, ధర్మాన ప్రసాదరావు, బగ్గ లక్ష్మణరావు కుటంబాల మధ్య కొనసాగుతున్న పోరు 2012 ఉప ఎన్నికల్లో రాజకీయ పరిణామాల నేపథ్యంలో శిమ్మ ప్రభాకరరావు, బగ్గ లక్ష్మణరావు ధర్మాన ప్రసాదరావుకు మద్దతుగా నిలిచారు. ప్రసాదరావు వైసిపిలో చేరడంతో ఆ పార్టీ నుంచి బగ్గ, శిమ్మ కుటంబాలు వీడి మరలా టిడిపి పక్షంలో చేరారు. 2012, 2014 ఎన్నికలో టిడిపి తరపున బరిలో నిలిచిన బగ్గ రమణమూర్తి, వైసిపి అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ సమీప బంధువులు, అలాగే ఇరువురు పోలాకి మండలం మబగాం గ్రామానికి చెందిన వారే. అప్పట్లో ధర్మాన సోదరుల మధ్య ఉన్న పోరు ఫలితంగా నియోజవర్గంలో వీరి క్యాడర్ కూడా రెండుగా వీడిపోవడంతో బగ్గ రమణమూర్తి విజయం సాధించారు.

మారిన స్వరూపం

ధర్మాన కృష్ణదాస్ అనుకూలంగా ఉండే నియోజకవర్గంలో 2012 ఉప ఎన్నికల నుంచి రాజకీయ ..స్వరూపం మారింది. 2012 ఉప ఎన్నికల్లో వైసిపి తరపున ధర్మాన కృష్ణదాస్, కాంగ్రెస్ తరపున ధర్మాన రామదాస్ బరిలో దిగారు. అప్పటివరకు ధర్మాన సోదరులకు అనుకూలంగా ఉండే మండల, గ్రామస్థాయి నాయకులు రెండు గ్రూపులుగా చీలిపోయారు. 2014 ఎన్నికల్లో ధర్మాన సోదరులు ఒక్కటైనా.. క్యాడర్ మాత్రం ఒక్కటి కాలేకపోయింది.

అభ్యర్థులూ... జాగ్రత్త

ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. గురువారం నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో పలు పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే నామినేషన్ దాఖలు చేసే విషయంలో ఎన్నికల సంఘం సూచించిన విధానాలు పూర్తిగా చదివి అర్థం చేసుకుని నామినేషన్ పత్రాన్ని పూర్తిచేయాలి. నామినేషన్లు వేసే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తల గురించి ప్రతి అభ్యర్థీ తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పార్లమెంట్ అభ్యర్థులు నామినేషన్లల్లో ఫారం–2ఎ, అసెంబ్లీ అభ్యర్థులు ఫారం–2బి ఆర్డీకి అందజేయాలి. పార్లమెంట్ అభ్యర్థికి దేశంలోని 545 నియోజకవర్గాలలో ఎక్కడైనా ఓటు హక్కు ఉండవచ్చు. అసెంబ్లీ అభ్యర్థులు మాత్రం అదే నియోజకవర్గ ఓటరై ఉండాలి. ఇతర ప్రాంతాలు/జిల్లాకు చెందిన అభ్యర్థులు పోటీచేస్తే

పొరపాటు చేస్తే తిరస్కరణ

ఆయా జిల్లాల నుంచి ధ్రువీకరించిన ధ్రువపత్రం అందజేస్తే సరిపోతుంది. అభ్యర్థులు నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది. ఒక్కరోజే నాలుగు సెట్లు వేయాల్సిన పనిలేదు.

ఫారం-26 అఫిడవిట్ తప్పనిసరి

- అభ్యర్థికి చెందిన అన్ని విషయాలపైనా ఫారం 26లో అఫిడవిట్ ఇవ్వడం తప్పనిసరిగా ఎన్నికల సంఘం నిర్ధేశించింది.
- నోటరీ చేసిన అఫిడవిట్లో అభ్యర్థి విద్యార్హతలు, ఆస్తులు, అప్పులు, క్రిమినల్ కేసులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలు పొందుపరచాలి.
- ఫారం–26లో అన్ని కాలమ్స్ పూర్తి చేయాలి, ఖాళీలు వదలకూడదు. ఆయాకాలమ్స్ వారికి చెందినవి కాకుంటే నాట్ అప్లికేబుల్ అని రాయాలి. రూ.10 నుంచి 100 స్టాంపు పేపర్లపై అఫిడవిట్ ఇవ్వాలి. అభ్యర్థి రిటర్నింగ్ అధికారి వద్ద ప్రమాణం చేయాల్సి ఉంటుంది. జిల్లా జడ్జి, ఇతర మెజిస్ట్రేట్ వద్ద ప్రమాణం చేసినట్లు సర్టిపై చేసిన ధ్రువీకరణ పత్రాన్ని అనుమతిస్తారు. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లోని వివరాలన్నీ ప్రజలకు ఆయా ఆర్లు నోటీసు బోర్డులు, మీడియా ద్వారా తెలియజేయనున్నారు.
- అభ్యర్థి అఫిడవిట్ ప్రతి పేజీలో సంతకం చేయడంతో పాటు అటెస్టేషన్ ఉండేలా జాగ్రత్త పడాలి.
- అదనపు అఫిడవిట్ ఆర్బికి అందజేయాలి.
- ప్రభుత్వ సర్వీసులో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన తరువాత ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు ప్రభుత్వ క్వార్టర్లు, వాటర్, టెలిఫోన్, విద్యుత్తు అద్దెకు సంబంధించి నో డ్యూ సర్టిఫికెట్లు సమర్పించాలి.
- నామినేషన్ ఉపసంహరణ తరువాత 10 రోజుల్లోపు అభ్యర్థుల నేర చరిత్రకు సంబంధించి రెండు ప్రధాన పత్రికల్లో మూడుసార్లు, ఎలక్ట్రానిక్ మీడియాలో ఏడు సెకన్లలోపు మూడుసార్లు వారి సొంత ఖర్చుతో ప్రచురించాలి.
- దీనికి సంబంధించిన వివరాలన్నీ రిటర్నింగ్ అధికారికి అందజేయాలి.
- రాజకీయ పార్టీలు కూడా వారి అభ్యర్థులకు సంబంధించిన నేరచరిత్ర వివరాలు జిల్లా ఎన్నికల అధికారికి తెలియజేయాలి.
- పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థి ఖర్చు రూ.70 లక్షలు, అసెంబ్లీ అభ్యర్థి ఖర్చు రూ. 28 లక్షలుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది.

డిపాజిట్ చేయాల్సిన నగదు

- పార్లమెంట్ అభ్యర్థులు రూ.25 వేలు, అసెంబ్లీ అభ్యర్థులు రూ.10 వేలు డిపాజిట్ చేయాలి
- రిజర్వ్ నియోజకవర్గాలకు సంబంధించి ఎస్‌సి, ఎస్‌టి పార్లమెంట్ అభ్యర్థులు రూ.12,500, అసెంబ్లీ అభ్యర్థులు రూ.5 వేలు రిటర్నింగ్ అధికారికి నగదు రూపంలో చెల్లించవచ్చు. ట్రెజరీలో కేటాయించిన పద్దుకి చెల్లించిన చలానా, రిజర్వ్ బ్యాంకులో నగదు జమ చేసిన on realme 8 చలానాలను ఆర్డీ అనుమతిస్తారు. చెక్కులు, డిమాండ్ డ్రాఫ్టులు అనుమతించరు. రిజర్వ్ నియోజకవర్గాల్లో పోటీ చేసే ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రం అందజేయాలి.
- అభ్యర్థులు మూడు నమూనా సంతకాలు చేసిన పేపర్ అందజేయాలి.
- అభ్యర్థి ఖర్చుకు సంబంధించి ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ ప్రారంభించి వివరాలు ఇవ్వాలి.
- అభ్యర్థి/ఎన్నికల ఏజెంట్ పేరున సంయుక్తంగా బ్యాంకు అకౌంట్ ఉన్నా అనుమతిస్తారు.
- రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద 100 మీటర్లలోపు ఎవరినీ అనుమతించరు.
- ఎన్నికల సంఘం గుర్తించిన పార్టీలకు చెందిన అభ్యర్థులను ఒకరు ప్రతిపాదించాలి.
- రిజిష్టర్ పార్టీలకు చెందిన అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులను 10 మంది ఆ నియోజకవర్గానికి చెందిన వారు ప్రతిపాదించాలి.

అభ్యర్థి సన్నిహితులు బందోబస్తు సిబ్బందితో వివాదాలకు దిగితే వారిపై క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశాలున్నాయి.

ఫొటోల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం బయట, లోపల వీడియోగ్రఫీ చేస్తారు.
- ఎన్నికల నామినేషన్ వేయడానికి ర్యాలీలతో వస్తే ఆ ఖర్చును అభ్యర్థుల ఎన్నికల ఖర్చుగా నమోదు చేస్తారు.
- పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు ఫొటోల విషయమై జాగ్రత్తలు వహించాలి. 2/2.5 సైజు ఫొటో ఇవ్వాలి.
- కూలింగ్ గ్లాసెస్, టోపీ పెట్టుకొని ఉన్నవి, నవ్వుతున్న, నిలబడిన ఫొటోలు అనుమతించరు.
- ఫొటో వెనుక భాగంలో వైట్ బ్యాక్ గ్రౌండ్ ఉండేలా చూడాలి.
- బ్యాలెట్ పేపర్పై అభ్యర్థి కోరుకున్న పేరును ముద్రించేందుకు అనుమతి ఇవ్వరు.

ఆన్‌లైన్‌ద్వారా..

ఈసారి శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో నామినేషన్ సమర్పించే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. ఇందులో మొదటి 'సువిధ' యాప్‌లో ఎన్నికల సంఘం నియమాల ప్రకారం వివరాలు నమోదు చేయాలి. అనంతరం సదరు అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి నుంచి అపాయింట్‌మెంట్ తేదీ వస్తుంది. అప్పుడు అభ్యర్థి లేదా ప్రతిపాదించే వ్యక్తులు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి నామినేషన్ పత్రాల వివరాలతో కూడిన ధ్రువపత్రాలను అధికారికి అందించాల్సి ఉంటుంది.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి చక్రధరరావు అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీ లక్ష్మి ఫిల్లింగ్ స్టేషన్, శివాని గ్యాస్ ఏజెన్సీ, ఎల్‌పిజి గ్యాస్ గోడౌన్ వద్ద పనిచేస్తున్న సిబ్బందికి అగ్ని ప్రమాదాలు జరిగేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే మంటలను నిలువరించడానికి తీసుకోవాల్సిన సాధనాలపై తెలియజేసారు. అనంతరం మాక్ డ్రిల్ నిర్వహించి పోస్టర్లను పంపిణీ చేసారు. సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : జ్ఞానభారతి పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక అధికారి ప్రశాంత్‌కుమార్ అవగాహన కల్పించారు. సీనియర్ సెకండరీ స్కూల్ సెక్రెటరీ, సిఇఒ జోహార్ ఖాన్ ఆదేశాల మేరకు మాక్‌డ్రిల్ ఏర్పాటు చేశారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టు వి.రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, హెడ్ మినిస్టర్స్ రషీద సుల్తానా, మేనేజర్ ప్రమోద్, సిఇటి కైలాస్ పండ, డి.రామచంద్ర పాల్గొన్నారు

పలాస : అగ్నిమాపక వారోత్సవాల్లో అగ్నిమాపక అధికారులు స్థానిక సాయిశిరీష పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. గ్యాస్, ఎలక్ట్రికల్ వల్ల అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసు కోవాల్సిన జాగ్రత్తలపై డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కవిటి భారతి, ఎస్‌ఎఫ్‌ఎ బి.సోమేశ్వరరావు, ఎల్.ఎఫ్లు కె.యుగంధర్, పి.శ్రీనివాసరావు, టి.జనార్ధనరావు, కె.సంతోష్‌కుమార్, ఎ.రాము, ఎస్.రవిశంకర్, చిరంజీవి పాల్గొన్నారు.

ఆమదాలవలస : పెట్రోల్ బంక్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

'సూపర్ సిక్స్'పై ప్రచారం

ఆమదాలవలస : పోస్టర్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ గీత

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టి సర్వనాశనం చేసిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కిందని మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత అన్నారు. గురువారం పురపాలక సంఘంలోని 16వ వార్డు పరిధిలోని డాబాల వారి వీధి, శివన్నారాయణ క్వార్టర్స్, మార్కెట్ వీధి తదితర ప్రాంతాల్లో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం చేపట్టి పోస్టర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సూపర్ సెక్స్ పథకాల వలన ప్రజలకు చేకూరే మేలుపై మహిళలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ గడచిన ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్ర భవిష్యత్‌ను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళి, బోర గోవిందరావు, తమ్మినేని విద్యాసాగర్, గుడ్ల రాజ్యలక్ష్మి, బోయిన సునీత, నాగళ్ల మురళి, శిల్లా గురునాధరావు పాల్గొన్నారు.

బూర్జ: మండలం ఉప్పినివలస, వైకంఠపురం పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో మాజీ జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటా సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రమేష్, సర్పంచ్‌లు వెంకట రమణ, సత్యం, కె.వెంకట్, సీతారామరాజు, అంపిలి గణపతిరావు, కన్నం నాయుడు, మాజీ వైస్ ఎంపిపి పీరుకట్ల ప్రభాకరరావు, పైడి సత్యప్రసాద్, లంక జనార్ధన, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: బాబు సూపర్ సిక్స్ పథకాల ప్రచారంలో భాగంగా మండలం అలికాం పంచాయతీ అల్లి చెరువు, తండ్యంవలస పంచాయతీ బెండివాని చెరువు వద్ద మాజీ ఎంపిపి గొండు జగన్నాధరావు ఉపాధి కూలీలతో మాట్లాడారు. టిడిపి హయాంలో పెద్దఎత్తున ఉపాధి పనులు చేపట్టి ఎంతోమందికి పని కల్పించి సకాలంలో వేతనాలు చెల్లించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో అలికాం సర్పంచ్ రంధి అప్పలస్వామి, ఎంపిటిసి నాగేశ్వరరావు, అంబటి వైకుంఠం, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని తలగాంలో టిడిపి నాయకులు బగాది శేషగిరి, హనుమంతు రామకృష్ణ, మహిళా అధ్యక్షులు మెండ దమయంతి, చాపర గణపతి, మట్ట పురుషోత్తం, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, కోళ్ల లవకుమార్, సుందరమ్మ, బెహరా కాళీ, దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్‌చంద్, జీరు వెంకటరెడ్డి, ఇప్పిలి జగదీష్, సోడిమూడి కిరణ్‌కుమార్ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడుకు మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

బూర్జ : ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

శ్రీకాకుళం రూరల్ : ప్రచారం చేస్తున్న జగన్నాథరావు

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ బెల్లుపడాలో ఎమ్మెల్యే అభ్యర్థి బెందాళం అశోక్, ఎంపి అభ్యర్థి రామ్మోహన్ నాయుడుకు మద్దతుగా నాయకులు దాసరి రాజు , కర్రి నాగరాజు, రుకమంగాధర్, లండా నీలవేణి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

23న రవికుమార్ నామినేషన్

ప్రజాశక్తి- ఆమదాలవలస

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా కూన రవికుమార్ ఈ నెల 23న నామినేషన్ వేయనున్నట్లు ఆయన తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బిజెపి, టిడిపి, జనసేన బలపర్చిన ఉమ్మడి కూటమి అసెంబ్లీ అభ్యర్థిగా మంగళవారం ఉదయం 10.45 గంటలకు తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీ నుంచి టిడిపి కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని రవికుమార్ కోరారు.

25న శంకర్ నామినేషన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శ్రీకాకుళం నియోజక వర్గం కూటమి అభ్యర్థిగా గొండు శంకర్ ఈనెల 25న తన నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. ఎంపి రామ్మోహన్ నాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా పార్టీ అధ్యక్షులు కూన రవికుమార్‌తో పాటు జిల్లాలో ఉన్న పార్టీ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నట్టు తెలిపారు. మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలను నామినేషన్ కార్యక్రమానికి ఆహ్వానిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.

వైసిపిలో పలువురు చేరిక

ఆమదాలవలస : మండలంలోని చిట్టివలసలో టిడిపి నుండి వైసిపిలోకి 30 కుటుంబాలు స్పీకర్ తమ్మినేని సీతారాం సమక్షంలో చేరారు. గురువారం టిడిపి నాయకుడు కూన నాగు ఆధ్వర్యంలో 30 కుటుంబాలు వైసిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి స్పీకర్ సీతారాం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూన నాగు మాట్లాడుతూ వైసిపి విధి విధానాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, మండల ప్రత్యేక ఆహ్వానితులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, బొడ్డేపల్లి రమేష్ కుమార్ పాల్గొన్నారు.

122 మంది వాలంటీర్ల రాజీనామా

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి పంచాయతీలో 43 మంది, గోవిందపురంలో 29, దండుగోపాలపురంలో 24 మంది, వడ్డితాండ్రలో 27 మంది వాలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. ఈ రాజీనామా పత్రాలను ఆయా సచివాలయ కారద్యర్శులకు అందజేశారు.

23న తల్లిదండ్రుల సమావేశం రద్దు

టెక్కలి : పాఠశాల విద్యా సంవత్సరం ముగింపులో భాగంగా ఈ నెల 23న విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేయాలన్న ఉత్తర్వులు రద్దు య్యాయి. ఈ ఏడాదికి సంబంధించిన ప్రతిభని వివరించి వారికి ప్రగతిపత్రాలు అందివ్వాలనే ఉద్దేశంతో సమావేశం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ ఆదేశాలు జారీ చేశారు. అయితే సమావేశంలో ప్రగతి, పాఠశాలల అభివృద్ధి వివరించే నేపథ్యంలో ప్రభుత్వం గురించి వివరించాల్సి ఉంది. దీంతో ఉపాధ్యాయులు, సంఘాలు ఆలోచనలో పడ్డాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో సమావేశం నిర్వహణ కష్టతరంగా ఉంటుందని ఉపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థుల జవాబుపత్రాలు మూల్యాంకనం చేసి, ప్రగతిపత్రాలు అందివ్వడం వరకు సమంజసంగా ఉంటుంది. అయితే విద్యాసంవత్సరం ముగింపు సందర్భంగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహణ సాధ్యంకాదని ఆభ్యంతరాలు వ్యక్తం చేయడంతో విద్యాశాఖ నుంచి సరళీకరణ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 23న నిర్వహించాల్సిన సమావేశం విద్యాసంవత్సరం ఆరంభం జూన్ 12న నిర్వహించాలని ఆదేశాలు జారీ కావడంతో 23 తల్లిదండ్రుల సమావేవేశం రద్దయింది.

జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఆమదాలవలస : పోస్టర్లను పంపిణీ చేస్తున్న సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర అభివృద్ధి జగన్‌తోనే సాధ్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం పట్టణంలోని 14వ వార్డు ఐజె నాయుడు కాలనీలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో వైసిపిరి ఓటువేసి మరొక్క అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకు వెళ్లాలన్నా, సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలన్నా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, దుంపల శ్యామలరావు, బొడ్డేపల్లి రమణమూర్తి, విశ్రాంత ఉపాధ్యాయులు బొడ్డేపల్లి జోగారావు, బెండి నారాయణరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: పేదల పక్షపాతి సిఎం జగన్మోహన్ రెడ్డి అని వైసిపి నాయకులు ధర్మాన రామ్మో మనోహర్ నాయుడు అన్నారు. పొన్నాం పంచాయతీ నవనంపాడు, బమ్మిడివానిపేట, గొల్లపేట, పొన్నాంలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ధర్మాన ప్రసాదరావు, ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలాకి : మండలంలోని పిరియాగ్రహంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్‌కు మద్దతుగా జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి వివరించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ధర్మాన రామలింగం నాయుడు, ఎంపిపి ముద్దాడ భైరాగినాయుడు, ఎఎంసి చైర్మన్ దుంపల భాస్కరరావు, పార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు పాల్గొన్నారు.

'ఐతమ్'లో నూతన పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిఎస్‌ఇండ్‌హెచ్, ఎంబిఎ విభాగాల పరిధిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న సాయిబాబు నెయ్యిలు రచించిన 'బిజినెస్ ఎకనామిక్స్' అనే నూతన పుస్తకాన్ని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. ఈ పుస్తకం బిటెక్ మొదటి ఏడాది, ఎంబిఎ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆరెడ్డి డీన్ డాక్టర్ డి.ఆజాద్, బిఎస్‌ఇండ్ హెచ్‌డి డాక్టర్ ఆర్.శాంతికుమార్, ఎంబిఎ హెచ్ ఒడి డాక్టర్ బి.శివకుమార్, పుస్తక రచయిత సాయిబాబు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

శిరీష విజయానికి బాటలు వేద్దాం

పలాస : టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థిని గౌతు శిరీష విజయానికి బాటలు వేద్దామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు పిలుపునిచ్చారు. అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయా పార్టీల ముఖ్య నాయకులతో గురు వారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు కేవలం 25 రోజులు మాత్రమే ఉందని, విస్తృతంగా గ్రామాల్లోను, పట్టణాల్లోను పర్యటించి గౌతు శిరీష విజయానికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పీరికట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్, జోగ మల్లేష్, అంబటి కృష్ణమూర్తి, అట్టాడ వాసు, బోసుబాబు, నాగరాజు, సప్ప నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

నందిగాం : వచ్చే ఎన్నికల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరల్ కమర్ సూచించారు. ఈ మేరకు కాపు తెంబూరులో గురువారం పోలీసు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో టెక్కలి డిఎస్‌పి బాలచంద్రారెడ్డి, సిఐ సూర్యచంద్రమౌళి, తహశీల్దార్ వి.పద్మావతి, ఎంపిడిఒ శివప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి రాజీనామా చేయాలి

కోటబొమ్మాళి: ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ గెలుపుపై ఆయనకు నమ్మకం ఉంటే ముందు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి తదుపరి ఎమ్మెల్యేకి నామినేషన్ వేయాలని, అంతేకాని, తన స్వార్థానికి వాలంటీర్లతో రాజీనామా చేయించి వారిని బలి పశువులను చేయడం తగదని చిన్నసాన టిడిపి నాయకులు నంబాళ్ల రాజశేఖర్ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. దువ్వాడ శ్రీనివాస్ ఎన్నికల ప్రచారంలో ప్రజలు ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ ప్రచారంలో పాలు పంచుకోపోయే సరికి వాలంటీర్లుతో బలవంతపు రాజీనామాలు చేయించారని ఆరోపించారు.

వంద శాతం హామీల అమలు

ప్రచారం చేస్తున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సిఎం జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ వంద శాతం అమలు చేశారని పశుసంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని చినవంక, దోకులపాడు, గుల్లలపాడు, శరదాపురం, తాడివాడ, కిడిసింగి, వజ్రపుకొత్తూరు గ్రామాల్లో గురువారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వజ్రపుకొత్తూరు అక్కుపల్లి మీదుగా కాశీబుగ్గ, టెక్కలిపత్నం నుంచి నువ్వలేవు వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు. ఇంటింటికీ శుద్ధమైన తాగునీరు అందించే బహత్తర కార్యక్రమం చేపట్టామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటే వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు గురయ్యనాయుడు, సర్పంచ్‌లు నర్తు లక్ష్మీనారాయణ, వడ్డి సరిత కరుణాకర్, దువ్వాడ మధుకేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న విజయ

ఒక్క అవకాశం ఇవ్వండి

ప్రజాశక్తి- కవిటి

వచ్చే ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని వైసిపి అభ్యర్థి పిరియా విజయ కోరారు. ఈ మేరకు ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్‌తో కలిసి గురువారం వరకలో ప్రచారం నిర్వహించారు. జెడ్‌పి చైర్‌పర్సన్‌గా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశామని అన్నారు. ఈసారి ఆదరించి అక్కున చేర్చుకుంటే ప్రతిఇంటా ఆడబిడ్డగా అందరికీ అండగా ఉంటానని అన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మధులత

'ఓక్లాండ్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- టెక్కలి

ఓక్లాండ్ అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు ఒలింపియాడ్ ఇన్‌స్టో పరీక్షల్లో ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ మల్లా మధులత గురువారం తెలిపారు. ఈ ఏడాది జనవరి నెల్లో జరిగిన పరీక్షల్లో భాగంగా ఫలితాలు విడుదలయ్యాయని అన్నారు. వీటిలో తమ పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులు ప్రతిభకనబరిచారని, వీరిలో నలుగురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని అన్నారు. మెడల్స్‌తో పాటు ధ్రువీకరణ పత్రాలను అందజేశామన్నారు. ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

టిడిపి కండువా వేస్తున్న గోవిందరావు

టిడిపిలోకి 'లోతుగెడ్డ'

ప్రజాశక్తి- కొత్తూరు

వైసిపిలో బహిష్కరణకు గురైన లోతుగెడ్డ తులసీవరప్రసాద్ టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు స్థానిక చిట్టిబాబు కళ్యాణ్ మండపంలో లోతుగెడ్డ తన అనుచరులతో గురువారం టిడిపిలో చేశారు. వీరికి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ సీనియర్ నాయకులు తులసీవరప్రసాదరావు టిడిపిలోకి రావడం ఆనందంగా ఉందన్నారు. టిడిపి విజయానికి అందరమూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి బి.కృష్ణవేణి, మెండ సుమతి, వడ్డి గౌరి, చింతాడ శ్రీను, చీకటి వీర్రాజు, రేగేటి కన్నయ్య, వి.శ్రీను, రమేష్, ఇ.ప్రభాకర్‌దొర పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతి

పాడె మోసిన ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కవిటి

అప్పటివరకు ఉల్లాసంగా, ఉత్సాహంగా తమతో తిరుగుతూ టిడిపి విజయం కోసం శ్రమించిన ఆమె ఇక లేదన్న వార్తతో టిడిపి శ్రేణులు శోకసంద్రంలో మునిగిపోయాయి. కార్యకర్తలను సొంత కుటుంబంలా భావించే ఎమ్మెల్యే అశోక్ ప్రచారంలో తన వెన్నంటే ఉండే సోదరి ఇక లేదన్న వార్త విన్న వెంటనే హతాశులయ్యారు. మండలంలోని బొరివంకకు చెందిన టిడిపి కార్యకర్త రెయ్యి భారతి బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. మంగళవారం రాత్రి కవిటిలో జరిగిన టిడిపి ప్రచారంలో పాల్గొన్న భారతి గుండెపోటుకు గురయ్యింది. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి

పాడె మోస్తున్న ఎమ్మెల్యే అశోక్

చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్ దంపతులు, నియోజకవర్గ టిడిపి శ్రేణులు హుటాహుటిన ఆమె నివాసానికి చేరుకున్నారు. ఆమె కుటుంబ సభ్యులకు అండగా నిలబడ్డారు. ఆద్యంతం అక్కడే ఉన్న ఎమ్మెల్యే అశోక్ చెమ్మగిల్లిన కళ్లతో ఆమెకు చేయాల్సిన కార్యక్రమాలు జరిపించి చివరి వరకూ ఆమె పాడెమోసి అశ్రు నివాళి అర్పించారు. ఈ సంఘటన ఆమె కుటుంబ సభ్యులతో పాటు టిడిపి శ్రేణుల్లో విషాదాన్ని నింపింది.

మాట్లాడుతున్న గౌతు శిరీష

నియోజకవర్గ సమస్యలపై దృష్టి

ప్రజాశక్తి- పలాస

ప్రజా సమస్యలపై దృష్టిసారించామని, అందుకనుగుణంగా పార్టీ అధినేత ప్రకటించిన మేనిఫెస్టోతో పాటు పలాస నియోజకవర్గ సమస్యలపై తాను ప్రత్యేకంగా ఒక ప్రణాళిక రూపొందించుకున్నానని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. ఈ మేరకు టిడిపి కార్యాలయంలో కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీరు, పారిశుధ్యం మెరుగుపరుస్తామని అన్నారు. శివారు ప్రాంతాలకు సాగునీరు అందిస్తామని హామీనిచ్చారు. అలాగే ఈ ప్రాంతంలోని యువత కోసం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పర్చేందుకు డిఫెన్స్ అకాడమీతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నెలకొల్పనున్నట్లు చెప్పారు. పలాస మండలంలో ఆఫ్‌షోర్ పూర్తి చేయడం, మందస మండలంలోని డబారుసింగి, దామోదరసాగర్, కళింగదళ్, జంతిబంద, సంకుజోడు, తదితర చిన్నతరహా సాగునీటి వనరులకు మరమ్మతులు చేపట్టి ప్రతి సెంటు భూమికీ సాగునీరందేలా చూస్తానన్నారు. ఉద్దాన ప్రాంతంలో ఏనుగుల సంచారంపై అటవీశాఖాధికారులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, చర్యలు చేపడతామన్నారు. ఏనుగుల దాడిలో ప్రాణాలు కోల్పోకుండా చూస్తానని చెప్పారు. ఉద్దాన ప్రాంతం అనగానే ముందుగా గుర్తుకువచ్చేది జీడి, కొబ్బరి పంటలని, అందుకు సంబంధించిన అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేసి, కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహమిస్తామన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని ఒంద్రుజోలలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో టిడిపి నుంచి వైసిపిలోకి గురువారం చేశారు. పార్టీలో బి.శివ, నిమ్మగెడ్డ తేజ, సమితి మిన్నారావు, బి.అప్పలనాయుడు, నక్క రమణారావు, బి.కృష్ణారావు ఉన్నారు. వీరందరికీ వైసిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ

వైసిపి కండువా వేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

సూర్యనారాయణ, గోగుల వరప్రసాదరావు నాయుడు, పి.లక్ష్మణరావు, జి.ఆనందరావు, బ.ఇశ్రీను, నాగేంద్ర పాల్గొన్నారు.

నేడు దువ్వాడ నామినేషన్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి నియోజకవర్గం ఎమ్మెల్యేగా శుక్రవారం నామినేషన్ వేయనున్నట్లు అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నామినేషన్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు వెంకటేశ్వర ఆలయం నుంచి ఇందిరాగాంధీ, అంబేద్కర్ కూడళ్ల వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామని అన్నారు. 3 గంటలకు నామినేషన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే కార్యకర్తలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తగు చర్యలు తీసుకున్నామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండెలి సుజాత, చింతాడ గణపతి, దవళ కృష్ణారావు, పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, వైఎస్ ఎంపిపి మన్మెల కిషోర్, ఎంపిటిసిలు కూన పార్వతి, పీత హేమలత, వాకాడ శ్రీధర్‌రెడ్డి, నాగళ్ల శంకరరావు, కిల్లి అజయ్‌కుమార్, తమన్నగారి కిరణ్ పాల్గొన్నారు.

నేడు త్రినాథ్‌బాబు నామినేషన్

ప్రజాశక్తి- పలాస

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మజ్జి త్రినాథ్‌బాబు శుక్రవారం ఉదయం 10.50 నిమిషాలకు నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. సుమారు 500 మందితతో కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి నుంచి పలాస తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీతో నామినేషన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్ ప్రక్రియకు కాంగ్రెస్, వామపక్ష నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రచారం చేస్తున్న అచ్చెన్నాయుడు

అచ్చెన్నాయుడు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని పలు గ్రామాల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం విస్తృతంగా ఎన్నికల్లో ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు గొల్లవూరు, సొంటినూరు, చిన్నారి, గోకర్లపల్లి, రాంపురం, లక్ష్మీపురం, జైపురం, బెల్లుకోల, బైరిబడ్డపాడు, రతజన, బొడ్డపాడు పర్యటించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. టిడిపి హయాంలో లిఫ్ట్ ఇరిగేషన్లు, రోడ్లు, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాఫ్ ఇన్సూరెన్స్‌లు అందించామని అన్నారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు.

ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

మరో అవకాశం ఇవ్వాలి

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని జాడుపుడి పంచాయతీలో గురువారం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజుతో కలిసి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న అవినీతి, అరాచక పరిపాలనకు రానున్న ఎన్నికలతో ముగింపు పలకాలని పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు అశోక్‌కి దాసరి రాజుకు తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బంగారు కూరయ్య, మాదిన రామారావు, పి.చినబాబు, ప్రదీప్, టి.వి.రమణ, రాంకుమార్ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న రమణమూర్తి

రమణమూర్తి ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని కింజరాపువానిపేట, దీర్ఘాసి కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఉమ్మడి కూటమి పార్టీల అభ్యర్థి బగ్గు రమణమూర్తి గురువారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పల్ల సూరిబాబు, చిట్టి సింహాచలం, సూరపు నాని, సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన పాల్గొన్నారు.

ముగిసిన వార్షిక పరీక్షలు

ప్రజాశక్తి- టెక్కలి

ఈ ఏడాది ముగింపు విద్యా సంవత్సరానికి నిర్వహించిన వార్షిక పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఈ నెల 6న పరీక్షలు ప్రారంభమయ్యాయి. విద్యాశాఖ ఆధ్వర్యాన నూతనంగా ఏర్పాటు చేసిన టోఫెల్ పరీక్షలు నిర్వహించారు. కొద్ది రోజుల క్రితం ప్రాథమికస్థాయి విద్యార్థులకు పరీక్షలు పూర్తి కాగా, 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు గురువారంతో పరీక్షలు ముగిశాయి. ఈ నెల 23 వరకు పాఠశాల నిర్వహణ జరగాల్సి ఉండడంతో విద్యార్థులు రాసిన జవాబు పత్రాలు మూల్యాంకనం చేపట్టి మార్కులను ఆన్‌లైన్‌లో పొందుపరిచి ప్రగతి పత్రాలు అందించాలి. ఈ పనుల్లో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు.

ఓటుహక్కుపై ప్రచారం చేస్తున్న వాకర్స్

ఓటును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి రాజ్యాంగ పరిరక్షణకు సార్వత్రిక ఎన్నికలు ప్రధాన పాత్ర పోషిస్తాయని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, శాసపు జోగినాయుడు, పి.జి.గుప్తా అన్నారు. జై భారత్ రూపొందించిన పోస్టర్‌ను గురువారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీతివంతమైన పాలన సాగించే నేతలను ఎన్ను కోవాలన్నారు. నోట్లతో ఓట్లు కొనుగోలు చేయాలనుకొనే నేతలకు బుద్ధి చెప్పాలన్నారు. జై భారత్ సంస్థ జిల్లా అధ్యక్షుడు జివి.నాగభూషణ్, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బి.దేవీ ప్రసాద్, నాగేశ్వర ఈశ్వరరావు, గొర్ల వాసుదేవరావు, గుడ్ల జగ్గారావు, గోలీ ఉమా మహేశ్వరరావు, డాక్టర్ జి.ఎన్.రావు పాల్గొన్నారు.

టెక్కలి : ఇవిఎంలను పరిశీలిస్తున్న నూరల్ కమర్

స్ట్రాంగ్‌రూమ్‌కు చేరుకున్న ఇవిఎంలు

ప్రజాశక్తి- టెక్కలి

మే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఓటర్లకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న ఇవిఎంలు గురువారం టెక్కలి చేరుకున్నాయి. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలో వీటిని భద్రపరిచారు. ఇవిఎంలతో వచ్చిన ప్రత్యేక వాహనాన్ని టెక్కలి సబ్‌కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరల్ కమర్ పరిశీలించారు. ముందుగా ఇచ్చిన సమాచారం మేరకు వైసిపి, టిడిపి, కాంగ్రెస్, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు బగాది శేషగిరి, టి.బి.జె.గుప్త, చిగిలిపల్లి శ్యామలరావు, బూరె నరేంద్రలు వాహనం వద్దకు చేరుకుని సీళ్లను పరిశీలించారు. వీరందరి సమక్షంలోనే సబ్ కలెక్టర్ వాహనాల సీళ్లను తొలగించారు. నియోజకవర్గానికి 378 సియు, 378 బియులు, 409 వివి పాట్‌లతో పాటు, పార్లమెంటరీకి సంబంధించి 378 సియులు. 378 బియులు 409 వివి పాట్‌లు చేరుకున్నాయి. కార్యక్రమంలో ఎన్నికల డిటి శంకర్, తహశీల్దార్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస: నియోజవర్గంలో మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు వినియోగించునున్న ఇవిఎంలు గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్నాయి. నియోజకవర్గంలోని 259 పోలింగ్ కేంద్రాల్లో ఉపయోగించనున్న ఇవిఎంలు ప్రత్యేక వాహనంలో తీసుకువచ్చారు. ఎఆర్ఒ కె.వేణు గోపాల్ వీటిని పరిశీలించి ప్రధాన పార్టీల ప్రతినిధుల సమక్షంలో వాహనాన్ని తెరిచి వెంకట చిరంజీవినాగ్ (వైసిపి), బివి రమణమూర్తి (టిడిపి), బస్వా షణ్ముఖరావు (కాంగ్రెస్) సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు.

21న మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

ఇచ్ఛాపురం: స్థానిక పురుషోత్తంపురంలోని ఎపి మోడర్ స్కూల్‌లో వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ దుంపల వైకుంఠరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు తమ హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. 21 ఉదయం పది నుంచి 12 గంటల వరకు పరీక్షలు ఉంటుందన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి, బైపిసి, ఇసిసి, ఎంఇసి గ్రూపుల్లో ప్రవేశం పొందడానికి అప్లికేషన్ ఆన్‌లైన్ ద్వారా చేసుకోవడానికి చివరి తేదీ 22, మే అని అన్నారు.

సమస్యల నడుమ చదువు

- అరకొర వసతలతో ఇబ్బందులు
- నాబార్డు నుంచి రాని నిధులు
- మరుగుదొడ్లుకి తాళం వేసిన కాంట్రాక్టర్

పాఠశాలల్లో విద్యార్థినులకు ఇబ్బంది కలుగకుండా ఉండేలా వారి సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలని 2012 అక్టోబరు నెలలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. విద్యాశాఖ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా మూత్రశాలలు, మరుగు దొడ్లు ఏర్పాటు చేయని కారణంగా సర్కారు బడుల్లోని విద్యార్థులు ఆరుబయటకు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకునే పరిస్థితే నెలకొంటోంది.

ప్రజాశక్తి- జి.సిగడాం

జి.సిగడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. నాడు-నేడు పథకానికి ప్రభుత్వ నిధులు కేటాయించ కపోవడంతో బిల్లులు చెల్లించని కారణంగా గుత్తేదారు పాఠశాల మరుగుదొడ్లకు తాళం వేశారు. ఈ నేపథ్యంలో మరుగుదొడ్లు లేక విద్యార్థులతో పాటు మహిళా ఉపాధ్యాయులు సైతం ఆరుబయటకి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్ణంగా ఉన్న మరుగుదొడ్లు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నాడు నేడు మొదటి విడతలో భాగంగా రూ.1.38 కోట్లు నిధులు కేటాయించారు. ఆ పనులను నాబార్డు గుత్తేదారులకు అప్పగించింది. అప్పటివరకు శిథిలావస్థలో ఉన్న పాఠశాల పాత మరుగుదొడ్లను ధ్వంసం చేసి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ నూతన మరుగుదొడ్లు నిర్మించ లేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఉపాధ్యాయుల కోసం ఉన్న ప్రత్యేక మరుగుదొడ్లను 2018లో నిర్మించినా వాటికి కూడా ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు చెల్లించని కారణంగా గుత్తేదారు వాటికి తాళం వేశారు. జి.సిగడాంతో పాటు చుట్టుపక్కల 16 గ్రామాల నుంచి ఈ పాఠశాలలో 420 మంది విద్యార్థులు చదువు తున్నారు. ఇందులో 160 మంది బాలికలు ఉన్నా బాలికల కోసం ప్రత్యేకంగా కనీసం సౌకర్యాలు లేవని ఆరోఎ స్తున్నారు. బాలురుతో పాటు బాలికలు సైతం మరుగుదొడ్ల కోసం ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు బయట మరుగు దొడ్లు వినియోగించడం వలన బాలికలకు పలు అనారోగ్య సమస్యలు దారితీస్తున్నాయంటున్నారు. వెంటనే విద్యా శాఖాధికారులు, ప్రభుత్వం కల్పించుకొని మరుగు దొడ్లు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్యలు అధికం

పాఠశాలలో మరుగుదొడ్లతో పాటు తరగతి గదుల్లో కూడా అనేక ఇబ్బందులు ఉన్నాయి. ఉపాధ్యాయులే అరకొర నిధులతో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా నెట్టుకు వస్తున్నారు. పదవ తరగతి పరీక్షలు సమయంలో కూడా మౌలిక వసతులు లేని కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. మరుగుదొడ్లు మౌలిక వసతులు లేని కారణంగా పాఠశాలలో చేరే బాలికల సంఖ్య తగ్గుముఖం పడుతుందని, తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయిస్తున్నారని హెచ్ఎం చెబుతున్నారు.

తాళం వేసి ఉన్న మరుగుదొడ్డి

తాగునీటి సమస్య

తాగునీటి వసతి లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకొంటున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో భోజనం చేశాక విద్యార్థులు తాగునీటి కోసం పాఠశాలకు సమీపంలో గల బోరుకి వెళ్లి దాహం తీర్చుకుంటున్నారు. వంట చేయడానికి కూడా మంచి నీరు బోరు లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నామని వంట చేసే మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సరిపడా తరగతి గదులు లేవు

విద్యార్థులకు సరిపడ తరగతి గదులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కట్టిన మరుగుదొడ్లకుకు ప్రభుత్వం బిల్లు చెల్లించకపోయినా తమ విజ్ఞప్తి మేర కాంట్రాక్టర్ వినియోగించుకునే అవకాశం ఇచ్చారు. మూడేళ్లయినా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కొన్ని నెలల క్రితం మరుగుదొడ్లకు తాళం వేశారు. బిల్లులు రాకపోవడం వల్లే తాళం వేస్తున్నట్లు కాంట్రక్టర్ తెలిపారన్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాల నుంచి విద్యార్థులు వేరే పాఠశాలలకు వెళ్తున్నారు. అధికారలు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- పి.వి.నరసింహామూర్తి, ప్రధానోపాధ్యాయులు

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, రూరల్

నగరంలోని బర్మా కాలనీకి చెందిన పలువురు టిడిపిలో చేరారు. టిడిపి నాయకులు అల్లంశెట్టి జనార్ధనరావు, పేట పద్మల ఆధ్వర్యాన వైసిపికి చెందిన పలు కుటుంబాలు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సమక్షంలో పార్టీలో చేరారు. బెవర రమణ, రెడ్డి ఎర్రయ్యల నాయకత్వాన వీరంతా ఆయనను కలిశారు. పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రెడ్డి శంకర్ పాల్గొన్నారు.

రూరల్ మండలంలోని భైరి 3వ వార్డు మెంబర్, వైసిపి నాయకులు గుండ లక్ష్మీనారాయణ తన అనుచరులు అంబటి జగదీష్, భైరి శ్రీరాములు తదితరులతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సమక్షంలో టిడిపిలో చేరారు. రామ్మోహన్ నాయుడును ఎంపీ, గొండు శంకర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు శంకర్ నాయకత్వంలో పని చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అంబటి లక్ష్మి రాజ్యం, నక్క శంకరరావు, బిజెపి నాయకులు గొలివి కరుణాకరరావు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు : మండలం కింతలిలో టిడిపి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ సమక్షంలో 95 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. గ్రామానికి చెందిన 14 మంది మాజీ సైనికులతో పాటు పలువురు వార్డు సభ్యులు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహన్, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, మాజీ సర్పంచ్ దవల గణపతిరావు, టిడిపి నాయకులు కిల్లి రామారావు, సింగూరు రామారావు, శేషగిరి, రాము, నారాయణరావు, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : టిడిపిలో చేరిన వారితో గొండు శంకర్

చుక్కనీరు ఇవ్వని కుళాయిలు

పైపులైను సరే తాగునీరేదీ ?

- మంచినీటికి తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- బూర్జ

తాగునీటి కోసం అవస్థలు తప్పడం లేదు. ఎంతో ఆర్పటంగా ప్రారంభించిన పనులు ఆర్ధాంతరంగానే విడిచిపెట్టడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొల్లివలస పంచాయతీ పరిధిలోని సుంకరాడలో ఇంటింటా కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందిం చేందుకు అటు అధికారులు ఇటు ప్రజా ప్రతినిధులు ఎంతో ఆర్భాటంగా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా జల జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామంలో ఇంటింటా కొళాయిల కోసం పనులు ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి కొళాయిలను ఏర్పాటు చేశారు. మోటర్ వేసి పైప్‌లైన్ ద్వారా తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేశారు. అయితే ట్యాంక్ నిర్మించకపోవడంతో తాగునీరు అందడం లేదని గ్రామస్తులు వాపోయారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా తయారైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటా కొళాయిల ద్వారా సకాలంలో తాగునీరు అందు తుందని సంతోషపడ్డ తమకు మోటారుకు వేసిన పైపు కూడా విరిగిపోవడంతో తాగునీరు అందడం లేదని గ్రామస్తులు తెలిపారు. రైతుల బోర్లుకు వేసే పైపులు తెచ్చి మోటారుకు అమర్చి గ్రామానికి ఒక కొళాయి కనెక్షన్ ఇచ్చినట్టు గ్రామస్తులు వాపోతున్నారు.

ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడంతో తాగునీరు దొరకడం లేదని గ్రామస్తులు వాపోయారు. ఈ విషయాన్ని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం శూన్యమని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్ నిర్మించాలని, పైపులైను సక్రమంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాటర్ ట్యాంకు కోసం తీసిన గొయ్యి

తాగునీరు గగనమే

కొళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ వాటర్‌ట్యాంక్ ఏర్పాటు చేయకపోవడంతో తాగునీరు లేదు. అధికారులు నిర్లక్ష్యం వల్ల తాగునీటి కోసం తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సక్రమంగా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

- అనుమూరి సరస్వతి, సుంకరాడ